# అమ్మదొంగా...



పాలగుమ్మి పాటలు

# “అమ్మ దొంగా !”

## పాలగుమ్మి పాటలు

May, 1991

PUBLISHED BY

NADAVINODINI

NADAVINODINI
'Jayahomatha' 8-3-982/3,
Srinagar Colony,
Hyderabad - 500 873
Telephone : P.P : 228031

Price Rs. 10/-

PRINTED AT
Rachana Offset Printers
Behind Hotel Samrat,
Ferozguda, Hyderabad - 11
Phone : 263449

LASER TYPESETTED BY

21st Century
Hyderabad
Phone:876986

# ఈ సంపుటి గురించి

'గీతం - సంగీతం' ఈ రెంటికీ అవినాభావ సంబంధం ఉంది. అందమైన భాషలో, చక్కటి భావాలతో అర్థవంతంగా వ్రాసిన గీతానికి అమరినట్లుగా, సంగీత రచన అన్ని పాటలకూ అమరదు. అటు రచయితగా, ఇటు సంగీత దర్శకునిగా 50 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగి లలిత సంగీతానికి ఒక విశిష్టతను చేకూర్చిన ప్రజ్ఞాశాలి శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారు. తొలిసారిగా వారి పాటలని పుస్తకరూపంలో ప్రచురించే భాగ్యాన్ని 'నాదవినోదిని'కి ప్రసాదించినందుకు సంస్థ ఎంతగానో గర్విస్తోంది.

లలిత సంగీతంలో - మరువరాని రచనలు మరుపురాని పాటలు - ప్రజలు మరచిపోకుండా, చేతనయిన ప్రయత్నం చేయాలని 'నాదవినోదిని' దృఢ సంకల్పం. ఆ ఉద్దేశ్యంతోనే గత సంవత్సరం (1 జూన్ 1990 తేదిన) పాలగుమ్మి వారి సంగీత దర్శకత్వంలో, వారి గాత్ర ధారణతో ఒక కేసెట్ మీకందించాం.

ఈ పుస్తకంలోని పాటలు లలితసంగీత గాయనీ గాయకులకు ఉపయోగంగా వుంటాయని, ఇందులోని రకరకాల పాటలు చాలావరకు AIR ద్వారానూ ఇతర లలిత సంగీత కార్యక్రమాలలోనూ, శ్రీ పాలగుమ్మి వారి బాణీలో అనేక సంవత్సరాలుగా గాయనీ గాయకులు పాడుతూనే ఉన్నారు. అందువలన ఈ పాటలు నేర్చుకోవడం సులభం అని చెప్పవచ్చు.

ఈ పుస్తక ప్రచురణలో మాకు తోడ్పడిన శ్రీ T.P.బాబుగారికి, ముఖచిత్రం వేసిన శ్రీ S.B.శంకర్ కుమార్‌గారికి రచనా ప్రింటర్స్‌కీ కృతజ్ఞతలు.

రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన నాదవినోదినికి ఊపిరపోసి తన శాయశక్తులా ఈ సంస్థ కళాకారులను తీర్చిదిద్దుతూ, సంస్థ అభివృద్ధికి మార్గదర్శకులయిన శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారికి- నాదవినోదిని కృతజ్ఞతాభివందనాలతో, గౌరవసూచకంగా - వారి 72 వ పుట్టినరోజు సందర్భంగా - ఈ రోజు ఈ పుస్తకాన్ని అందిస్తోంది.

'నాదవినోదిని'

శరత్

# నా మాటలు

నేను ఆకాశవాణిలో పనిచేస్తున్నప్పుడు ఆకాశవాణి అవసరాలకు, ఇంకా ఇతరత్రా కొన్ని సందర్భాలకు ఏవో పాటలు అల్లడం తటస్థపడింది. ఆ పాటలు ఇవాళ అచ్చులోకి ఎక్కి, పుస్తకరూపంలో వస్తాయని ఊహించనూలేదు, ఆశించనూ లేదు. ఎందుకంటే 'పాట' పాడడానికి ఉద్దేశింపబడింది, చదవడానికి కాదు. సంగీతంతో పెనవేసుకు పోయిన మాటల్ని, ఆ నాద శరీరంనుంచి విడదీసి చదివితే ఆ మాటలు పేలవంగా కనిపించవచ్చు. మామూలు మాటకి నాదస్పర్శ తగిలితే, ఆ మాట రెక్కలు తొడుక్కుని రాగవీధిలో విహరిస్తుంది. అర్థానికి మించిన అనుభూతి అందిస్తుంది. అందువల్ల ఈ పాటలు అచ్చులోకి రావడానికి నేను ఇష్టపడలేదు మొదట్లో. కాని మిత్రుడు, "నాదవినోదిని" వ్యవస్థాపకుడు అయిన శరశ్చంద్ర కుమార్, నామాట పడనివ్వలేదు. అక్కడా అక్కడా విడి కాగితాలమీదా, పాత డైరీలలోనూ పడి ఉన్న పాటలన్నీ పుస్తకరూపంలోకి తీసుకురావాలని అతని పట్టుదల. చివరికి, అతని ఒత్తిడికి, నాదవినోదినీ సభ్యులు చూపుతున్న ఉత్సాహానికీ లొంగిపోయి, ఈ పాటలు వాళ్ళ చేతుల్లో పెట్టాను.

ఎల్లగా అచ్చులోకి వచ్చేశాయి కాబట్టి, ఈ పాటలగురించి నాలుగు మాటలు చెప్పుకోవాలి.

ఈ పాటలు అల్లడానికి ప్రేరణ కృష్ణశాస్త్రి గారే అని చెప్పాలి. ఎంతో సన్నిహితంగా, ఎన్నో ఏళ్ళు ఆయన గేయ రచనా యజ్ఞంలో, నేనూ ఒక భాగం అయిపోవడం నా అదృష్టం. ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రంలో శాస్త్రి గారు, నేనూ పనిచేస్తున్న రోజులలో, ఇంచుమించు, ప్రతిరోజూ నేను వీణతో ఆయన వద్ద కూర్చోడం ఆయన అటూ ఇటూ పచారు చేస్తూ, మనస్సులో మెదిలిన భావానికి కళ్ళు మెరుస్తూ, అటూ ఇటూ పర్యాయంగా తల తిప్పుతూ, మాటలతో మైత్రి కలుపుతూ, ఓ పల్లవో అర పల్లవో అనడం, ఆ మాటల్ని సంగీతంతో పొత్తు కలిపే నా యత్నం - అదంతా ఒక అపూర్వ అనుభవం.

ఈ సంగీత సాహిత్యాలకు ఓ పట్టాన జత కలిసేది కాదు. వీణ వాయిస్తూ, సన్నంగా గొంతు కలిపి పాడుతూ, రకరకాల రాగ వరుసల్లో ఆ మాటల్ని రకరకాల భంగిమల్లో నటింపచేవాణ్ణి. అల్లా పాడుతూ పాడుతూ ఉంటే, ఎప్పుడో చటుక్కున వెళ్ళి కూర్చునేవి ఆ మాటలు ఓనాద చిత్రంలో- స్వంత ఇంట్లో కూర్చున్నట్టు. అప్పుడు సంగీత సాహిత్యాలు విడదీయలేనంతగా పెనవేసుకుపోయేవి. దాన్నే శాస్త్రి గారు 'Inevitable tune' అనేవారు.

ఆ రోజుల్లో కృష్ణశాస్త్రి గారి సంగీత నాటికలు ఎన్నో ప్రసారం అవుతుండేవి. ఎంతో వస్తు వైవిధ్యంతో, రకరకాల సన్నివేశాలకీ, సందర్భాలకీ పాటలు కావలసి వచ్చేవి. ఒక్కొక్క పాట బయటికి రావడానికి ప్రసవవేదన చాలా ఉండేది. ఒక్కొక్కచోట పాట మొండికేసి కూర్చునేది. ఆ సందర్భాన్నో, సన్నివేశాన్నో, సరిగ్గా స్ఫురింపజేసే మాట ఏదో ఉంటుంది. అది అక్కడ పడాలి. ఆ మాట దొరికే దాకా పాట ముందుకు నడిచేది కాదు. ఆ మాటని 'Inevitable word' అనే వారు శాస్త్రిగారు. ఆ 'Inevitable word' కోసం ఆయన అశాంతిగా గబాగబా అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు, నా నోరు ఊరుకోక ఏవో మాటలు

అందిస్తుండే వాడిని. నేను అందిచ్చిన మాట, ఎప్పుడైనా ఆయన అనుకున్నదానికి దగ్గరగా వస్తే "అందాకా ఆ మాట ఉంచి పాడు" అనే వారు. ఇల్లా ఒక్కొక్క పాటా, కన్ను ముక్కు తీరు దిద్దుకుంటూ, ఒక సజీవ నాద శిల్పంలా తయారయేది.

అల్లాంటి సమయాల్లో ఎన్నో విషయాలు చర్చకు వస్తుండేవి. కవిత్వం గురించి, గొప్ప కవులగురించి శాస్త్రి గారు అద్భుతంగా మాట్లాడేవారు. సంగీత సాహిత్యాలమీద సమాన అధికారం సంపాదించిన వాగ్గేయకారుల రచనల్లో సంగీతపరంగా ఉండే విశేషాలు - లయ సంబంధమైన చమత్కృతులు, వస్తు వైవిధ్యంతో స్వంత గొంతులతో పలుకుతున్న భావ కవులు, కేవలం సాహిత్యంలోనే నిష్ణాతులవడంవల్ల, వాళ్ళ గేయాలు పాడడంలో గాయకుడు ఎదుర్కొనే ఇబ్బందులు - ఇల్లా ఎన్నో విషయాలు దొర్లుతుండేవి.

రాను రాను శాస్త్రిగారు ఏదైనా పాట వ్రాసే ముందు, మాత్రా ఛందస్సుల నాడిలో పడిపోకుండా - ఒక సందర్భాన్ని గురించి ఒక భావం విపులీకరించి చెపుతూ - 'దీన్ని సంగీతంలో ఎల్లా చెపుతావ్ ? ఏవో ఏ యిష్టం వచ్చిన మాటలు పెట్టి పాడు' అనేవారు. ఏదో ఒక నడకతో, రకరకాల విరుపులతో - మధ్య మధ్య విశ్రాంతితో (Musical silence) ఒక పంక్తి ఉన్నట్టు మరో పంక్తి పడవకుండా ఏవో మాటలు పెట్టి పాడేవాణ్ణి. తర్వాత వయ్యారంగా వంపులు తిరుగుతూ జలజల ప్రవహించే ఆ నాద స్రవంతికలో శాస్త్రిగారి మాటలు పూల పడవల్లా తేలుతూపోయేవి. ఒక గొప్ప పాట పుట్టేది. ఇల్లాగ ఎన్నో గొప్ప పాటల పుట్టుకతో నాకు కాస్తో కూస్తో సంబంధం ఉంది కాబట్టి - ఏవో పాటలు నేనూ చాటునుండి అల్లుతుండేవాడిని. కాని వాటిని బయటపెట్టే ధైర్యం లేకపోయింది, కృష్ణశాస్త్రిగారు హైదరాబాద్‌లో ఉన్నన్నాళ్ళూ. శాస్త్రిగారు హైదరాబాద్ నుంచి మద్రాసు మకాం మార్చేశాక, ధైర్యం వచ్చి, ఒకసారి 1977 సంవత్సరం ఆగస్టు 21వ తేదీన, ఆకాశవాణి, రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన లలిత సంగీత సభలో, శ్రీమతి వేదవతి ప్రభాకర్‌కు నా పాట ఒకటి నేర్పించి పాడించాను. మాతృ హృదయంతో, మధురమైన గాత్రంతో "అమ్మ దొంగా ! నిన్ను చూడకుంటే నాకు బెంగ" అంటూ ఆనాడు పాడింది చల్లగా. ఆనాటినుంచి ఈనాటి వరకూ, "అమ్మ దొంగా" రసహృదయుల మన్ననలనందుకుంటూనే ఉంది. "ఫరవాలేదు. నేనూ పాటలు వ్రాయవచ్చు." అనిపించింది. ఎప్పుడైనా లోపల స్పందించినప్పుడు, లోలోపల నాద ఝరి సందడి చేసినప్పుడు, ఏవో పాటలు వచ్చాయి. ఈ పాటలు మీ ఆదరాభిమానాలు పొందుతాయని నా ఆశ.

-పాలగుమ్మి విశ్వనాథం



# మా అన్న పద్మరాజు స్మృతికి అంకితం

ఆతని మనసే వెన్న
ఆతని మాటలు బహుమెత్తన
ఆతడన్నింట మిన్న
మాకు లేడు మరి మా అన్న ॥

మా అన్న యింటికి లేవు తలుపులు
అక్కడికి పోవడానికి అక్కర్లేదు పిలుపులు
అక్కడ ఎప్పుడూ వినిపించవు అపశృతులు

కథ చెప్పినా కవితల్లినా
కలం విదిపితే చాలు
ఒలికేవి అక్షర సత్యాలు
కాస్త కదిపితే చాలు
తెరచుకొనేవి జ్ఞాన భాండాగారాలు
అమృతమితరులకు పంచి
ఆకలి తను మిగుల్చుకుని
ఆఖరికి వెళ్ళిపోయాడు మా అన్న ॥

# విషయసూచిక


| శీర్షిక | పేజీ |
|---|---|
| 1. అమ్మ దొంగా! | 1 |
| 2. వీణ మీటితే ఈమని | 2 |
| 3. ఓ కృష్ణశాస్త్రి నీ పాట | 3 |
| 4. అన్నయ్యా- అక్కయ్య | 5 |
| 5. మురళీ! బాలమురళీ | 6 |
| 6. కొమ్మా రెమ్మా ఊపేనే ఉయ్యాల | 7 |
| 7. ఎన్నిసారులు అన్నదో! | 8 |
| 8. నిను కొలుచును ఈ జగమంతా | 9 |
| 9. రామ కథ | 10 |
| 10. కలవరమెందుకు | 12 |
| 11. ఎప్పుడైనా ఒకసారి | 13 |
| 12. అహము విడచి | 14 |
| 13. ప్రతి రాత్రి మౌనముగా | 15 |
| 14. సర్వేశ్వరుని సకల సృష్టిలో | 16 |
| 15. దారిని చూపే దివ్యకాంతివి | 17 |
| 16. కోసుకొమ్ము ఈ కుసుమము | 18 |
| 17. ఈ వెన్నెల చూస్తే చల్లన | 19 |
| 18. పుచ్చపువ్వులా వెన్నెల | 20 |
| 19. సన్నజాజి పందిరి | 21 |
| 20. తలపులూరే కన్నెమనసు | 22 |
| 21. తోటకి తోడు తోపుంది | 23 |
| 22. ఎటు పోతారు మీరు | 24 |
| 23. పంట చేల గట్లమీద | 25 |
| 24. ఎంత సుందరమైనదీ జగతి | 26 |
| 25. స్వాగతం! నూతనవత్సరం! | 28 |
| 26. కొత్త రోజు | 29 |
| 27. విన్నావా నీ ముంగిట | 30 |
| 28. వేళా పాళా లేకుండా | 31 |
| 29. పుట్టిన రోజు పాట | 32 |
| 30. అదిగో ఆ వంక | 33 |
| 31. పెళ్ళంటే నూరేళ్ళ పంట | 34 |
| 32. కలగంటినే చెలి | 35 |
| 33. మనది ఈ దేశం | 36 |
| 34. వినబడింది ఒక్క పాలికేక | 37 |

35. ఆ మాట వింటే 38
36. శిధిలాలయ ప్రాంగణాన 39
37. అరెరె! లేవండిరా 40
38. చాల్ చాల్ చాల్ 41
39. ఆగరా! తమ్ముడు 42
40. గుడికి పోదాము 43
41. నీ కెప్పుడు వస్తుందీ వేకువ 44
42. ఇది ఏమి న్యాయం 45
43. ఇది ఘోరము ఘోరము 46
44. ప్రొగలు గ్రక్కుతూ కదిలింది 47
45. రాబడితో పనిలేదు 48
46. పొగబండి పిలిచింది 49
47. అక్కడ ఉందొక తోట 51
48. ఎవరు తాతా! నీవు 52
49. వేరే ఉందొక లోకం 54
50. తెల తెల్లవారింది 55

క్రైస్తవ భక్తి గీతాలు:
51. వచ్చిందర్రా పండుగ 56
52. అది ఒక రాతిరి 57
53. గొల్లవాళ్ళ పాట 58
54. బెత్లెహేమ్ నగరమా 59
55. దొరికింది నా మనస్సు ఎగిరింది 60
56. మనవలెనే మానవుడు 61
57. కడసారి విందు 62
58. వీడ్కోలు గీతం 63
59. నాదవినోదినీ 64



## అమ్మ దొంగా !

అమ్మదొంగా, నిన్ను
చూడకుంటే, నాకు బెంగ ॥

కొంగట్టుకు తిరుగుతూ
ఏవో ప్రశ్నలడుగుతూ
కలకలమని నవ్వుతూ
కాలం గడిపే నిన్ను
చూడకుంటే నాకు బెంగ ॥అమ్మదొంగా..

కథ చెప్పే దాక
కంట నిదుర రాక
కథ చెప్పే దాక
నన్ను కదలనీక
మాటతోచనీక
మూతి ముడిచి చూసేవు ॥అమ్మదొంగా..

ఎపుడో ఒక అయ్యని
నెగరేసుకు పోతే
నిలువలేక నా మనసు
నీ వైపే లాగితే
గువ్వ ఎగిరిపోయినా
గూడు నిదరపోవునా ॥అమ్మదొంగా..

నవ్వితే నీ కళ్ళు
ముత్యాలు రాలు, ఆ
నవ్వే నిను వీడక
ఉంటే అది చాలు
కలతలూ కష్టాలు నీ దరికే రాక
కల కాలం నీ బ్రతుకు కలలదారి నడవాలి ॥అమ్మదొంగా..

## వీణ మీటితే ఈమని

వీణ మీటితే ఈమని
తరలి వచ్చింది ఆమని
నా మనసు కోరింది ఏమని!, ఆ
వీణ పలుకు వినిపించమని॥

కొనగోట వీణ మీటితే
కొసవేళ్ళు నాట్యమాడితే
జడమైన వీణతీగె
జగమంత మారుమ్రోగె ॥

దిక్కు దిక్కుల స్వరసుందరులు
దివ్యనాదాలు వినిపింప
ఉక్కు తీగయే పూలతీవయై
విరుల వాన కురిపింప ॥

కైలాసమునివాసమా ! ఆ
పరమ శివుని సహవాసమా !, మము
విడచిపోవుట న్యాయమా, నీ
కెవరు సాటి యిల లేరు సుమా! ॥

పరమశివుడు తన ఆస్థానమున
పరవశించి నీ వీణ విని, మై
మరచి తాండవము జేసెనా!, ఈ
జగతి నిలువెల్ల పులకించెనా! ॥

చిరకాలము నీ కీర్తి పతాక
ఎగురు కైలాస గిరిదాక
కైలాసవాసి ఓ శంకరా
సుగుణాలరాసి మా గురువరా ॥



## ఓ కృష్ణశాస్త్రి నీ పాట

ఎటు చూచినా తెలుగునాట విన
వచ్చు ప్రతీ నోట, ఓ
కృష్ణ శాస్త్రి నీ పాట ॥

దుమ్ము ధూళీ దులిపి
పాత మాటలనె కలిపి
కొత్త అర్థాలు నిలిపి
పాటలు చెక్కే శిల్పి, విని
పించు ప్రతినోట ఓ
కృష్ణశాస్త్రి నీ పాట ॥

ఇలలో జరిగిన సమస్తం
పలుకుతుంది నీ కవిత్వం
మూగపోయినా నీ గళం, నీ
పాటలు పాడును ప్రతిగళం ॥

కంటి కొసలలో కొంటెతనం
మాటలవో చిరు చురుకుతనం.
ఎప్పటికప్పుడు కొత్తదనం, నీ
కవితకు చేరదు ముసలితనం ॥

మానవతావాది, వసు
ధైక కుటుంబం నీది, హృద
యాలు తట్టి పిలిచేది, ఏ
నాటికైన నిలచేది
అసలైన కవిత నీది
అది విన్న భాగ్యమే మాది.

"నారాయణ అల్లాయనీ
శివశివ అనరాదాయనీ
అందాల మేఘమాలాయనీ"
పదములె చాలు రామాయనీ

ఒక పదమా ! ఒక పాటా !
నీవు అన్న ప్రతి మాటా
ప్రతిధ్వనించును ప్రతిచోటా ॥

మాటలతో నీ మైత్రి, ఆ
మాటలు చేస్తయ్ చాకిరీ, సౌం
దర్య సీమల షికారీ, భావ
తురంగాలపై సవారి
భావ కవితకే మేస్త్రీ
అవునవును కృష్ణశాస్త్రీ ॥

చిందర వందర జుట్టు
చిరుగాలికే ఎగురును అట్టిట్టు
అందరినీ మరి ఆకట్టు
రవంత అత్తరుబొట్టు
ఎగిరే జుట్టు, గూడకట్టు
అత్తరు బొట్టు - అందరికంటె పై మెట్టు
భావ కవితకే సామ్రాట్టు ॥

ఉన్మత్త భావశాలి
ఊర్వశీ ప్రేమ గ్రోలి
ఉగ్రరూతలూపు నిశ్శైలి,
మాపైన కవితచల్లి
పసందైన పాట అల్లాలి
పరవశించి నేపాడాలి ॥
ప్రతిగుండె అవినిండాలి ॥



## అన్నాయా - అక్కయ్యా

బాలల రాజ్యం బావుటా ఎగరేసిందెవరయ్యా !
బాలవాణి ఇంటింటా వినిపించిందెవరయ్యా ! మా
అన్నయ్యా - అక్కయ్యా-అన్నయ్యా-అక్కయ్యా ॥

ఎన్నో ఏళ్ళ వెనుక, అప్పుడు నాటిన మొలక
అందరి హృదయానందమై, ఆంధ్ర బాలానందమై
ఏభై ఏళ్ళు నిండగా, జరుపుతోంది ఈ పండుగ ॥

నోటి మద్దెలను వాయిస్తూ, మాతో పాటలు పాడిస్తూ
నాటికలెన్నో రాసేస్తూ మాతో వేషాలేయిస్తూ
మాలో మంచిని పెంచీ, మాలో మమతలు నింపీ
మాలో ఒకడై అన్నయ్యా, మమునడిపించాడయ్యా ॥

ఆటలు పాటలు నాటికలు, అబ్బో! ఎన్నో వేడుకలు
పిల్లల నవ్వుల విందులు, పరవశించు తలితండ్రులు
అందరికీ ఆనందం, అందించే బాలానందం, మా
అన్నయ్య మరి అక్కయ్యా మాకు ఇచ్చినావరమయ్యా ॥

భావిపౌరులే బాలలనీ, బాల వాక్కులే బ్రహ్మవాక్కులనీ
నిజముగ నమ్మిందెవరయ్యా? నిజమని చెప్పిందెవరయ్యా ?
బాలలకోసం జీవితమంతా ధారపోసినది ఎవరయ్యా
మరపురాని మా అన్నయ్యా, మరువలేని మాఅక్కయ్యా

*(ఆంధ్ర బాలానందం డైమెండ్ జూబ్లీ సందర్భంగా పాడినపాట. )*

## మురళీ ! ఓ బాలమురళీ

మురళీ ! ఓ బాలమురళీ !
నీ గానరవళి సోకిన జనావళి
అన్నారు లే భళి భళీ !

నీ అంతరంగం అది నాద సంద్రం
నాద సౌందర్యం అది నీకు స్వంతం
ఏనాటిదో వరం త్రిస్థాయి గాత్రం
ఎదలు ముంచెత్తేది నీదు సంగీతం ||

నీ గాన మాధురులు చెవిని తాకిన చాలు
మూగ గొంతున కూడ రేగు నేవోరాగాలు
సొగసులూరించేటి నీదు తిల్లానాలు
యుగయుగాలు నిలుచు కీర్తి శిఖరాలు ||

కల్యాణినే కాదు కన కాంగినైనను
వశము చేసుకు పారవశ్యమున ముంచేవు
ఆశ తీరదు నాకు ఎన్ని సారులు విన్న
అవధులే లేని, నీ గాన మన్నిటల మిన్న ||

అందుకోవయ్యా ఈ చిన్ని కానుక
మదిలోన పొంగిన ఈ స్నేహగీతిక ||



## కొమ్మా రెమ్మా ఊపేనే ఉయ్యాల

కొమ్మా రెమ్మా ఊపేనే ఉయ్యాల
బంగరు బొమ్మా నీకేనే ఈ జోల ||

కలత నిద్దర బోకే
కలతలు మనకిక లేవే ||జో ! జో!

వంటింటి కుందేలు ఒకనాడు, మరి
పురుషులతో పందాలు ఈనాడు
వెనుకటి వలె గాదమ్మా, ఈ
నాటి ఆడ జన్మ ||

అమ్మామెదిగితేను, ఆ
అమ్మకు బెంగ కలిగేను, ఒక
అయ్య చేతిలో పెడితేను, ఆ
అమ్మకు శాంతి దొరికేను ||

అయ్యలు అందలమెక్కేరు, మొగ
అయ్యలు అందలమెక్కేరు
కట్నాలెన్నో గుంజుకొని
కొంపలు గుల్లలు జేసేరు ||

అలకలు అలిగి అల్లుళ్ళు
కాల్చుకు తిన్నారిన్నాళ్ళు, అప్పుడు
పెళ్ళంటేనే బరువు, ఇప్పుడు
మనసుకుదిరితే మనువు ||

# ఎన్ని సారులు అన్నదో

ఎన్నిసారులు అన్నదో
ఎన్నెన్ని తీరులు విన్నదో
అన్నకొలదీ విన్నకొలదీ
అమృతభరితము రామచరితము ॥

కలము పట్టీ కవివరేణ్యులు
గళము విప్పీ గాయకులు, నీ
మధురనామము కొలవగా, మై
మరచి నిను ధ్యానించగా
వెలసెనెన్నో పాటలు, నిను
చేరుటకు విరిబాటలు ॥

బ్రతుకు బరువై సుఖము కరువై
అలసి సొలసిన వేళల, ఏ
దారిలేని ఎడారిలో, ఆ
ధారమైనది నీదు నామము

ఎన్నిసారులు అన్నదో
ఎవరెన్ని తీరుల విన్నదో
అన్నకొలదీ విన్నకొలదీ
అమృత భరితము రామచరితము ॥



# నిను కొలుచును ఈ జగమంతా

నిను కొలుచును ఈ జగమంతా
నను మరువకుమో హనుమంతా ॥

రామచంద్రుని కొలువు దొరికెనట
రామనామమే దారిబత్తెమట
రాత్రింబవలు రామ ధ్యానమట
రామభక్తి సామ్రాజ్యపు దొరవట ॥

రామకీర్తనము చెవుల బడిననె
అడుగులు గదలక ఆగిపోదువట
అర మోడ్పుకనులతో అంజలి ఘటించి
అన్ని మరచి నర్తించెదవట ॥

శ్రీ పాదధూళి శిరసున దాలిచి
శత యోజనముల సంద్రము దాటి
సీతామాతా సేమమె అరసి
శ్రీ రామచంద్రుని ఓదార్చితి వట ॥

అయోధ్యరాముని అంతరంగమున
స్థిరముగ నెలకొన్న హనుమన్నా
ప్రభువుకు మామనవులందించుమన్నా
ఆ స్వామి నీ మాట కాదనడన్నా ॥

## రామకథ

ఎదలను మురిపించేది
సుధలను కురిపించేది, మన
బ్రతుకుల నడిపించేది, ఏ
నాటిదో ఈ దివ్యకథ
రామకథ ! శ్రీ రామకథ ॥

అవలీల ధనువును విరిచి
ధరణిజ సీతను గెలిచి
భార్గవరాముని మదమణచి
అయోధ్యవాసుల అలరించిన, ఆ
దశరథరాముని దివ్యకథ
రామకథ ! శ్రీరామకథ॥

ముద్దులభార్యకు వరమిచ్చి, ప్రియ
పుత్రుని అడవుల కనిపి, హా!
రామా యని పుత్రశోకమున
అసువులు బాసెను దశరథుడు, ఏ
నాటిదో ఈ జాలికథ !
రామకథ ! శ్రీరామకథ॥

నారచీరలు ధరియుంచి, తన
వారి నందరిని ఓదార్చి, సౌ
మిత్రి సీతయు వెంటరాగ
కారడవులకే కాపురమేగిన
దశరథరాముని దివ్యకథ
రామకథ ! శ్రీరామకథ॥

మనసు చెదరి ఒక సారి,
మౌనిభార్య ఆరేయి, ముని
శాపమున శిలగ మారి, నీ
పాద స్పర్శకై వేచి వేచి
విముక్తి నొందిన జాలికథ



రామకథ ! శ్రీరామకథ

కష్ట సుఖములు తెలియుటకా ?
దుష్టరాక్షసుల దునుముటకా?
స్వార్థ పరత ఇల తొలగుటకా ! ఒక
ఆదర్శము నెకొల్పుటకా, ఈ
వనవాసము నీకేలనయా! ఆ
వివరము తెలుపుము రామయా, ఏ
నాటిదో నీ దివ్యకథ॥

## కలవర మెందుకు

కలవరమెందుకు - కలతను చెందకు
మరుదినమునని మనుగడెటులని ||

బ్రతుకును గూర్చిన యోచనెగాని
భగవంతుని మది తలచవదేమి ? ||

కనిపెట్టినిను కాపాడే దొర
కరుణామయుడు వినుమా నీ మొర
మరువక స్వామిని తలచినచాలు
నిరతము నీకు కలుగును మేలు ||

కల్లోలము గద ఈ నాటిలోకము
కల్లకపటముల దరిజేరకుము
ఏమరితివిసుమా మిగులును శోకము
నిర్మల రూపుని మదిలో నిలుపుము ||



## ఎప్పుడైన ఒకసారి

ఎప్పుడైన ఒకసారి చూడాలనీ
ఏమేమొ నిన్ను నేనడగాలనీ
ఎన్నాళ్ళో నీ జాడ తెలియాలనీ
ఎవరెవరినో నేను అడిగితిని
అవాడ ఈవాడ తిరిగితిని
ఆ కొండ ఈ కోన వెదకితిని ||

నీ పిలుపు నా దాక వస్తుందనీ, నా
బ్రతుకులో ఒక మలుపు తెస్తుందనీ
ఏ నవ్వుడైనా నీ అడుగులేవని
అడియాసతో నేను మిగిలుంటిని ||

నీ ఆచూకి తెలిసి అ చోటు వెదకి
నే వచ్చి నీ తలుపు తడితే
లోన నె ఉండి లేడనిపించకు
లోకువ యని నన్ను నిరసించకు ||

నీవున్నావని, అసలే లేవని
నిను గూర్చి ఎన్నెన్నో కథలల్లినారు
ఎవుడైన మనము ఎదురెదురు పడితే
నా స్వామి నీవని నే పోల్చగలనా
నా అశ్రుధారల బంధించలనా ||

## అహము విడచీ

అహము విడచీ - ఇహము మరచీ
అర్పించుము నీ హృదయం, అది
వ్యర్థము గాక, స్వర్గము దాక
నడిపించును నిన్ను, ప్రభు
వాక్కునే వినుము, ప్రభు
మార్గమే కనుము ||

ప్రభు సేవలో గడిపిన కాలం
వ్యర్థము కాదది నిజము
పలుకులలో, నీ తలపులలో
మరువక ప్రభువును కీర్తించు ||

బాధలెగానీ, సుఖమేలేనీ
వృథా బ్రతుకనీ తలచకుము
పై నుండి ప్రభు నిను కనిపెట్టి
ప్రతి క్షణమూ కాపాడు, నీ
బాధలే తొలగించు, నీ
కష్టమే పరియించు ||

శోధనలెన్నో నీ కెదురైనా
శిరసు వంచక నిలబడుము
బ్రతుకు వేసిన ఈ పందెములో
నిరాశ చెందక నిలబడిన,
నీ కే చివరకు గెలుపు, ప్రభు
వాలకించును నీ పిలుపు ||



## ప్రతిరాత్రి మౌనముగా

ప్రతిరాత్రి మౌనముగా, నిను ధ్యానించు
ప్రతి పగలూ గొంతెత్తి, నిను కీర్తించు||

పరుగెత్తే ఆ సెలయేళ్ళు
పరవశమొంది నర్తించు
తరులూ లతలూ తన్మయమొంది
తనివితీరగా విరబూచు||

ప్రతినగము, ప్రతి నదము
ప్రతి నిమిషము నిను పరికించు
అనంతమగు ఈ ప్రకృతి
అనవరతము నిను స్మరియించు||

రెక్కలు సాచి నిను వెదకుటకు
రివ్వున ఎగిరే పక్షులు
నిను జూచుటకు మినుకు మినుకుమని
మిలమిలమెరిసే తారలు||

కొండాకోనా ఏది జూచినా
స్పందించును నా హృదయం
నింగీ నేలా ఎచటచూచినా
కనుపించును నీ రూపం ||

## సర్వేశ్వరుని సకల సృష్టిలో

సర్వేశ్వరునీ సకల సృష్టిలో
మానవుడే మిన్న - అది
మరువకుమో యన్న ||

అందాలన్నీ కలబోసి
అలంకరించీ ఈ జగతి
అనుగు బిడ్డలను కరుణించి
అనుభవించుడని మనకొసగె||

ప్రకృతిలోని ప్రతి అందం
పరమాత్ముని కే ప్రతిరూపం
ఉత్తమమూ, ఈ మానవ జన్మం
సఫలము చేయుటే మన ధర్మం||

మరువక స్వామిని అనుదినము
మనసున నిలిపీ అందరము
తలచితె చాలు ఇకమనము
దీవనలిచ్చును దినదినము ||



## దారిని జూపే దివ్యకాంతివి

దారిని చూపే దివ్య కాంతివి
ధరినీ జేర్చే కన్న తండ్రివి
నీవెనుమా ! నీ వెనుమా
నీ వెనుమా ! మా తండ్రివి||

తప్పుదారి పడకుండా నా అడుగులు
చేయి పట్టినడిపించు నన్నెపుడు
నీవె నుమా ! నీవెనుమా
నీవెనుమా ! మా తండ్రివి||

చెడు తలపులు నా మదిలోరానీకు
అటూ ఇటూ నా మనసు ఊగనీకు
నడిపించే నీ చేయి వదలనీకు
నా హృదిలో నీ రూపము చెరగనీకు
నీవెనుమా ! నీవెనుమా!
నీ వెనుమా ! మా తండ్రివి||

అంధకారమున నేను చిక్కినప్పుడు
ఆశలన్ని అణగి నేను అలసినప్పుడు
ఆఖరి గడియులు నన్ను చేరినప్పుడు
రావాలి సుమా ! తండ్రీయని పిలిచినప్పుడు
నీ వెనుమా ! నీ వెనుమా ! మా తండ్రివి ||

## కోసి కొమ్మ ఈ కుసుమము

కోసికొమ్ము ఈ కుసుమము - వేచి ఉంది నీ కోసము
చేసితివా ఆలస్యము ఎపుడు రాలునో ఈ సుమము॥

ఏగాలి ఎపుడు వీచునో నన్నేవైపు విసరివైచునో
నా బ్రతుకు నేలపాలగునో ఈ దుమ్ము ధూళిలో కలయునో
ప్రభూ వేవేగరమ్ము నిను చేరనిమ్ము కడు అల్పమైనదీ సుమము॥

నిన్నలంకరించిన మాలలో నాకర్హత ఎక్కడిదోయీ,
ఆరంగు రంగుల పూలతో నే పోటీ పడలేనోయీ॥ ప్రభూ వేవేగరమ్ము॥

నీకొనగోట నన్ను త్రుంచినా నా హృదయము రవ్వంత నొచ్చినా
నీ పదసన్నిధియే దొరికెనా నేనెంతో ధన్యను కానా॥ ప్రభూ వేవేగరమ్ము

సాయం సమయం వచ్చెనో పూజకు వేళయు మించెనో, నే
నేమియు తెలియని దీనను, నే నిన్నే నమ్మిన దానను॥ ప్రభూ వేవేగరమ్ము

నీ విచ్చినదీ జీవితము, ఇది నీకే ఎప్పుడు అర్పితము
నీ నీడలో కాస్త చోటిమ్ము నీ సేవలో నన్ను మననిమ్ము ప్రభూ వేవేగరమ్ము ॥



## ఈ వెన్నెల

ఈ వెన్నెల చూస్తే చల్లన,
చెలరేగే కోర్కెలు వెచ్చన
వేసితి ఊహల వంతెన
చేరితి ప్రేయసి చెంతన॥

సెలయేటి గలగలలా ! చెవిలో
నా చెలి గుసగుసలా ? చిరు
గాలుల సందడులా, నాచెలి
అడుగుల సవ్వడులా॥

మల్లెల మంచం వాలిచి
చుక్కల దుప్పటి పరచి
ఒకవేళ, ఈ నిశివేళ, తా
నొంటిగ వేచియుండెనో॥

అల్లన, మెల మెల్లన, నా
హృదయం లో లో ఝల్లన, ఏ
సుందరియో ఇటు వచ్చునో, ఆ
చందుర నే మరపించునో॥

## పుచ్చపువ్వులా వెన్నెల

పుచ్చపువ్వులా వెన్నెల
కవ్విస్తోంది నన్నిలా, మరి
మతిపోతోంది ఎలా ఎలా! ఎలా ఎలా!

ఈ .. చూకూ చింతా మనకేల
పోదాం పోదాం అలా అలా ||

రాత్రంతా మనదే
రోడ్లన్నీ మనవే
రాత్రంతా తిరిగేద్దాం
పగలంతా పడకేద్దాం
మనకేంపోయి! మనదేనోయ్ రమ్మందోయ్ ఈ రేయి !
ఈ..చీకూ చింతా మనకేల
పోదాం పోదాం అలా అలా ||

ఏమితో చక ఓసారి
పోతుంటే చక ఓసారి
పోతుంటే ఈ దారి
ఎదురొచ్చిందొక వయ్యారి
ఒయ్యారి అహ! ఒయ్యారి
గిరగిరగిర నా మనసు
బొంగరంలా తిరిగింది
త్రాచుపాములా వాలుజడ
నన్నే కాటేసింది ||



## సన్న జాజి పందిరి

సన్నజాజి పందిరి
సరసమున్న సుందరి
సరదాగా నవ్వింది
నిన్న రాతిరి ||

కొంటె చూపువిసిరి
పలకరిస్తే కసిరి
పైట చాటు చేసుకొని
పకపకా నవ్వింది ||

సనసన్నగ పాడుతూ
అటూ ఇటూ తిరిగితే
ఆ సన్నని నడుమేమో
అటూ ఇటూ ఊగితే
ఊపిరాడక నాకు మతిపోయిన రాతిరి ||

పడగెత్తే కోర్కెను
పగ్గ మేసి లాగి
నిప్పు నెయ్యి కుండానే
నింగి పైకి ఎక్కి
వెండిమబ్బు పాన్పుపై
వెన్నెల దుప్పటి పరచి
వేచి వేచి వేసారితి ఆరాతిరి
నాకు మాత్రమదియొక్క
అమావాస్యరాతిరి ||

## ఎటు పోతారు మీరు?

ఎటు పోతారు మీరు
ఇటే ఇటే మా ఊరు
ఎవరినడిగినా చెప్తుతారు, ఆ
యేటిపక్కనే మా ఊరు ||

మా గాలే వేరు
మహతీపి మా నీరు
మా ఊరి కోనేరు
చూశారా మరి పోరు ||

ఏటిగాలి వార్త లెన్నో
ఎగా మోసే తెస్తుంది
ఎప్పటికప్పుడు మా ఊరే
ముందడుగే వేస్తుంది ||

అటుపోతే కొలను
కొలను పక్కనే కోవెల
కోవెల కొలను నేస్తాలు,
మా ఊరికి అవి యే నేత్రాలు ||

ఎత్తైనా గుడి గోపురం, చే
యెత్తి దీవిస్తుంది
నడుంవంచి పనిచేసేవారిని
వెన్ను నిమురుతుంది ||



## పంట చేల గట్లమీద

పంట చేల గట్లమీద తిరగాలి
ఊహలేమో రెక్కలొచ్చి ఎగరాలి
మా ఊరు ఒక్కసారి పోయిరావాలి
జ్ఞాపకాల బరువుతో తిరిగి రావాలి ||

ఒయ్యారి నడకలతో ఆయేరు
ఆయేరు దాటితే మా ఊరు
ఊరి మధ్య కోవెల, కోనేరు
ఒక్కసారి చూస్తిరా వదిలిపోలేరు ||

పచ్చని పచ్చిక పైన మేను వాల్చాలి
పైరగాలి వచ్చి నన్ను కౌగిలించాలి
ఏరుదాటి తోట తోపు తిరగాలి
ఎవరెవరో వచ్చి నన్ను పలకరించాలి ||

చిన్న నాటి నేస్తాలు చుట్టూ చేరాలి
మనసు విప్పి మాట్లాడే మనుషుల కలవాలి
ఒకరొకరూ ఆప్యాయత లొలక పొయ్యాలి
ఆగలేక నా కన్నులు చెమ్మగిల్లాలి ||

# ఎంత సుందరమైనదీ జగతి

ఎంత సుందరమైనదీ జగతీ
భగవాను డొసగిన బహుమతీ ||

ఎంచి ఎంచి సృష్టించె నీ జగతి
కరుణించి మనకొసగె నీ వసతి ||

నింగిలో విహరించు మేఘాలు
నింగినీ దిగివచ్చు వర్షాలు
పొంగి పొరలు నదీ నదాలు
పరవశించే జనపదాలు ||

అటుఇటూ తలలూపుతూ
పసిడి పండే పంట చేలు
జోలపాడి జోకొట్టె, నూయల
నూచుపైర గాలులు ||

ఎవరికొరకో ఎగిరిపడు, ఆ
కడలి కెరటాలు
ఎందుకో తలలెత్తి చూచు
కొండ శిఖరాలు ||

ఎంత సుందరమైనదీ జగతి
భగవానుడొసగిన బహుమతి || హాయిగా ఆ పక్షులు - ఆకసాన షికారులు
రకరకాల రాగాలు విసిరే మావిగున్నల పికములు ||

కొత్త బానల పిలుపులు
పలకరించే చిలుకలు
ఎందుకొ ఆ నెమలులు, కను
విందుగా నాట్యమ్ములు ||

దట్టముగ ఆ అడవులు
దర్జాగ తిరిగే మృగములు
సందెవేళల ధూళి రేపుచు
తిరిగి పోయే ఆలమందలు ||



మిన్ను తెరచెను కన్నులు
మినుకు మినుకున తారలు
గగనములో గస్తీలు తిరిగే
గతులు తప్పని సూర్యచంద్రులు ||

ఎంత సుందరమైనదీ జగతి
భగవానుడొసగిన బహుమతి ||

## స్వాగతం ! నూతన వత్సరం !

స్వాగతం ! నూతన వత్సరం !
కొత్త ఆశల మందిరం
తెరచుకొన్నా మందిరం ॥స్వాగతం॥

నీ, రాకతో మా బ్రతుకులో
సుఖశాంతు లే నిండి, ఇక
నేటితో మా మనసులోపలి
కోరికలే పండి, చీ
కట్లు లేనీ బాటలో వయ
నింప మము దీవింపుము, ఒడు
దుడుకులేని జీవితం, సా
గింప మము కరుణింపుము ॥స్వాగతం॥

ఏటికే దారి, మా తోడుగానిలిచి, ఏ
లోటు లేకుండా మమ్ము నడింపించి, ఈ
దేశమంటే భక్తినీ, కలసి బ్రతికే శక్తినీ, మా
లోన పెంపొందింపుము॥స్వాగతం॥

కల్లోలము ఈ లోకము, ఇట
శాంతి సుధ వర్షింపుము
ఉల్లములనవభావములు, చిగు
రించ, ఇది శుభ సమయము, ఈ
కొత్త వత్సరము కొని తెచ్చుసంతసము॥ ॥స్వాగతం॥



## కొత్తరోజు

ఉగాదిలో ఈ జగానికే
వచ్చింది కొత్తరోజు
రోజు రోజు ఈ జీవితంలో
చూడాలి కొత్తమోజు॥

చీకటి పుంతలు గడిచి,
వెనకటి చింతలు విడిచి
కొత్త వత్సరం వచ్చెనులే, సరి
కొత్త కాంతులు తెచ్చెనులే॥

కొత్త గాలులూ సందడులు, గళ
మెత్తి పాడినా కోకిలలూ, ఏ
నాటి కలలో ఈనాడు పండి, మన
సంత పొంగె కోరికలు॥

ఈ భువనమంతా ఒకేలోగిలిగ
మారాలి ఈ రోజు
మనుషులంతా మనసు వొక్కటై
గడపాలి ప్రతీ రోజు॥

విరబూచిన ప్రకృతిలో
వికసించిన మోములతో, ప్రతి
గుండె తలుపులు తెరవాలి
శాంతి రమ్మని పిలవాలి ॥

## విన్నావా నీ ముంగిట

విన్నావా నీ ముంగిట
ఏదో కలకలం ! మరి
నీ కోసమె వచ్చిందట
కొత్త వత్సరం||

కష్టపడ్డ తమ్ముడూ
కలవర పడికిప్పుడు
చిరకాలపు నీ ఆశలు
చిగురించును ఇప్పుడు||

నీ రెక్కల కష్టమే ఈ మేడలు, ఆ
నీడలలో ఒదిగొదిగీ, నీ గుడిసెలు
నీ చేతుల నింపేవు మా గాదులు, మరి
నీ దాకా రాలేదు ఏ ఉగాదులు||

దగా పడ్డ తమ్ముడు దిగాలు పడకిప్పుడు
దర్జాగా నీ బ్రతుకు సాగును ఇంకెప్పుడు
చిన్నబోయె నీ మోము ఇన్నాళ్ళు
చేరవలో నీ కెపుడు కన్నీళ్ళు

కలతలన్ని తొలగెననీ, కొత్త పొద్దు పొడిచెననీ
కబురు చెప్ప వచ్చిందీ కోకిలమ్మా
నీ వాకిలి పూచింది ప్రతీ రెమ్మా
విన్నావా నీముంగిట ఏదో కలకలం||



## వేళాపాళాలేకుండా

వేళాపాళా లేకుండా
వెర్రిగ కోయిల కూసింది!
ఎందుకనీ ? ఎందుకనీ?
ఇక జగతికి నిత్యవసంతమనీ
ఈ అందమె అందరి స్వంతమనీ
ఆనందమె అందరి స్వంతమనీ||

వయ్యారంగా ఊగుతూ, పిలి
చేను పంటచేను
లే! ఠీవిలో చిరునవ్వుతో
ఆ రైతు బదులు పలికేను
డుకనీ ! మరి ఎందుకనీ !

ఇదివరదాకా బీడులు, మరి
ఇప్పుడు బంగరు పంటలు, పం
డించే, మహారాజుకీ, పలి
కేనుస్వాగతాలు, తలలెత్తి పంటచేలు||

కనుచూపుమేర దాకా
పరచుకొన్న ఆ పైరులు
అటు ఇటు తల ఆడిస్తూ
అంటున్నవి ఏమని?

కష్టపడి పని చేసేవారికి
కాపుర ముండవు కష్టాలు, ముద
నష్టవు మనుషులు గడపాలి, ఇక ముష్టి జీవితాలు||

## పుట్టిన రోజు పాట

ముచ్చటగ నీవు ఈ రోజు పుట్టీ
ఇచ్చట అందరినీ సంతోషపెట్టీ
పుట్టిన రోజు వేడుకగా
జరుపుకొంటున్న 'శ్రీరామచంద్రా'
అందుకోవయ్యా (అమ్మ) ఆశీస్సులు
పెద్దలనుండి దీవెనలు॥

మనసారగా నీకు శుభాకాంక్షలు
తృణమో పణమో చిన్న కానుకలు
అందిచ్చి మేము ఆరగింతుము
నీ విచ్చు ఈ విందు భోజనము (లేక)
నీ విచ్చే ఈ తీపి మిఠాయిలు॥

తిరిగీ తిరిగీ ఈ రోజు కావాలి
పెరిగే పెద్దవైనా ఈ రోజు జరపాలి
మరువక మమ్మల్నీ మరిమరి పిలవాలి
పుట్టిన రోజులు ఎన్నో చూడాలి, నీ
పుట్టిన రోజులు ఎన్నో చూడాలి॥

ఇక్కడ 'శ్రీ రామచంద్రా' అన్నచోట పుట్టిన రోజు జరుపుకుంటున్న వారి పేరు ఇమిడ్చి పాడుకోవచ్చు.



## అదిగో ఆవంక

అదిగో ఆవంక
ఆ చిలుకా గోరింక మనసులు
ఒకటైనా యింక మరి
చింతలు లేవింక॥

కలకల లాడే మోములు
కలలే నిండిన కన్నులు
ఇచ్చిరి వనితలు హారతులు, తల
వంచిరి నూతన దంపతులు॥

ముచ్చట మూడు ముళ్ళు, అవి
మొదలకు వేసే సంకెళ్ళు, దీ
వించిరి పేరంటాళ్ళు, వ
ర్ధిల్లమనీ వెయ్యేళ్ళు॥

ఏడడుగులు వేయగ
ఎడదలు ఒకటిగ కలియగ
మూడు పూవులు ఆరుకాయలుగ
వర్ధిల్లాలీ మీ కాపురం॥

## మనదీ ఈ దేశం

మనదీ ఈ దేశం, అని
చేసిరి ఎందరో త్యాగం, మరి
విడిచిరి ఎందరో ప్రాణం, ఈ
స్వాతంత్ర్యం కోసం, మన
స్వాతంత్ర్యం కోసం ॥

జాతి రథం కదలాలనీ
జయ ధ్వజం ఎగరాలనీ,
పై కెగరాలనీ
ముక్త కంఠముతో జాతి ఒక్కటై
సమైక్య గీతము పాడాలనీ
చేసిరి ఎందరో త్యాగం ॥

స్వార్థలు మనమున విడవాలనీ
సోదర భావము విరియాలనీ
భేదము చేసే వాదములన్నీ
వ్యర్థము లేనని తెలియాలనీ
చేసిరి ఎందరో త్యాగం ॥

మన సంపదలే పెరగాలనీ
జనులందరికవి చేరాలనీ
సుఖశాంతులు కొని తేవాలనీ
స్వర్గమె దిగి ఇటురావాలనీ
చేసిరి ఎందరో త్యాగం ॥
మన స్వాతంత్ర్యం కోసం ॥



## వినబడిందీ ఒక్క పొలికేక

వినబడిందీ ఒక్క పొలికేక
యువతరం లేచింది వేవేగ
ఎగిరెగిరి దూకింది మా లేగ
కులికింది మా రైతు తలపాగ ॥

హరిజనుడూ - గిరిజనుడూ
అందరితో సమానుడు
అడుగునున్న తమ్ముడు, అ
ధైర్యపడకు ఇప్పుడు
తలవంచడు ఇకమీదట సామాన్యుడు ॥

పాటుబడ్డ ప్రతివారికి
దొరుకుతుంది ప్రతిఫలం
కుంటుబడ్డ జీవితం
కుదుటబడుట ఇక నిజం ॥

## ఆ మాట వింటే

ఆ మాట వింటే, ఆ దారి వెంటే
మనము పోతిమంటే - బంగారపు పంటే ||

గతము విడిచి పెట్టి హితము చెవిని బెట్టి
మంచిని తలబెట్టి - మనసు నిలబెట్టి ||

ఏమోయ్ సోమరీ ! లేవోయ్ ఇక మరీ
పోయింది రాతిరీ - నీవే ఇక మేస్త్రీ ||

యుగయుగాల తరబడి - సాగింది దోపిడి
ఇక అంతా ఉమ్మడి - మన శ్రమయే పెట్టుబడి ||

మన రెక్కల కష్టంతో బంజరులే పండి
మన గాదులె నిండితే దేశానికి తిండి ||



## శిథిలాలయ ప్రాంగణాన

శిథిలాలయ ప్రాంగణాన
జయగంట నేడు మ్రోగింది
చెడి పాడుపడిన ఆ గుడిలోన
చిరు దివ్వె ఒకటి వెలిగింది ||

ఎండి వాడినా బ్రతుకువో,
కొండంత ఆశ రేగింది
తెగి ఎటోపడిన ఆ గాలిపటం
తల ఎత్తి పైకి లేచింది ||

చిన్నబోయినా మోములో, చిరు
నవ్వు దొంతరలు మొలిచాయి
నిన్న మొన్నటి పీడకలలన్ని
మన్నులో కలిసి పోయాయి.

కష్టపడి పని జేసేవారికి
కాపురముండవు కష్టాలు
ముచ్చటపడి భగవంతుడే, నెర
వేర్చు అభీష్టాలు ||

## అరెరే ! లేవండిరా !

అరెరే ! లేవండిరా !
అరెరే! రారండిరా !!

తొర తొరగా పోతోంది కృష్ణమ్మా
తొందరపడి పోతోంది కృష్ణమ్మా!

సాగరాన్ని చేరుటకై
సాగుతోంది కృష్ణమ్మా
మననందరి విడిచి
మన నందరి మరిచి ||అరెరే...||

నదినిక్కడ కట్టేస్తే
మన కంతా భుక్తి
నది నిక్కడ దూకిస్తే
నవ విద్యుత్ శక్తి ||అరెరే...||

మూడు కోట్ల ఈ జనం
ముప్పొద్దుల తినాలంటే
చీకూ చింతా లేక
చల్లగ బ్రతకాలంటే
ఆ వెయ్యాలి కృష్ణని
ఆనకట్ట కట్టి ||అరెరే...||



## చాల్ చాల్ చాల్ చాల్!

చాల్ చాల్ చాల్ చాల్ చాలు
చూసుకోవోయ్ వీలు సాలు
నా మాటవింటే మేలు, లేక
పోతే నవ్వుల పాలు, నీ
బ్రతుకే నవ్వుల పాలు.

అవును మరి ! రెక్కాడితేగాని డొక్కాడదంటావ్
మరి, ఏటేట పిల్లల్ని దండిగ కంటావ్!
చాల్ చాల్

గంపంత సంసారము, ఇక మీద
నీదేర ఈ భారము
తెలియక ఈ నేరము, చేసితిమి
మేమెపుడు నీ వారము ||

గాలిలో దీపమెట్టి, దేవుడా
నీ కొక్క దణ్ణమెట్టి, ఈ
సంతతి నీముందు పెట్టి నే
భజన చేస్తూ కూరుచుంటే ||చాల్ చాల్||

పాట : సంసారాన్ని పెంచకు
సుఖశాంతుల త్రెంచకు
కళ్ళకు గంతలు కట్టుకొని
గానుగెద్దులా తిరగకు ||చాల్ చాల్

## ఆగరా ! తమ్ముడూ !

ఆగరా ! తమ్ముడూ, ఒక్క
మాటరా రంగడు ॥

ఎల్లాంటి దేశం మనదిరా, మరి
ఇల్లాంటి కష్టాలు ఎందుకురా !
చేతులారా చేసుకున్నదిరా, నీ
బ్రతుకంత ఇల్లాగే నడవాలిరా ?
నా మాట కాస్తంత వినరా, నీ
కష్టాలే గట్టెక్కి పోతాయిరా ॥

నాలుగేళ్ళ క్రితం దాకా
చీకూ చింతా ఏమీ లేకా
నవ నవ లాడుతూ - పక పక నవ్వుతు
నాజూకు బొమ్మర నీ యింటిది, మరి
ఏటేటా కాన్పులు ఇప్పుడు
ప్రతి యింట నీకేమో అప్పులు
ఏటేటా నీ భార్య కాన్పులు, ఈ
వీధి చివరి దాకా అప్పులు ॥

భారీ సంతతి పెరిగితే
భార్య యౌవనం తరిగితే
బాదరబందీ మిగిలితే
బ్రతుకే బరవై సాగితే
అదేం న్యాయంర తమ్ముడూ
నామాట వినర రంగడూ ॥



## గుడికి పోదాము

గుడికి పోదాము రాముడి
గుడికి పోదాము
బడికి పోదాము, రాత్రి
బడికి పోదాము ॥

గుడికి పోయి రామన్న రాముడి
భజన చేదాము
బడికి పోయి తెలియనివన్నీ
తెలుసుకుందాము ॥

చల్లగ జూచి కాపాడుమని
వేడుకుందాము
మెల్లగ వచ్చి బడిలో మనలను
చూడమందాము

వయసు వచ్చిన వాళ్ళము మేము
చదువు కుంటేను
విడియమక్కరలేదని
ధైర్యము చెప్ప మందాము ॥

అక్షరాలు వ్రాసుకొని
అడిగి ఎన్నో తెలుసుకొని
అర్థం తెలిసే దేవుడి పాటలు
పాడుకుందాము
వ్యర్థంగాను తిరగక మనము
చదువు కొందాము ॥

# నీ కెప్పుడు వస్తుందీ వేకువ

నీ కెప్పుడు వస్తుందీ వేకువ
చదువురానివాడంటే లోకువ ఈ సత్యం తెలుసుకో
తెలుసుకొనీ మేలుకో ॥

వెనుకబడిన వాడంటే
ఎవడురా ?
వ్రాయుట చదువుట తెలియని
వేలిముద్రగాడురా ॥

మందు తిన్నవాడల్లే
మందకొడిగ నీవుంటే
మందలోని గొర్రెలాగ
మనుగడ సాగునురా ॥

వయసుతోను పనిలేదు
రాత్రిబడికి రండిరా
అయోమయపు జీవితం
కావాలిర కాంతిమయం ॥



# ఇది ఏమి న్యాయము

ఇది ఏమి న్యాయము స్త్రీ జాతికీ
ఇది ఏమి శాపము॥

ఎంతో ఉత్తమురాలు ఆ యింటికోడలు
అత్త చేతులబడి అగచాట్లు పడుతుంటే
ఇరుగు పొరుగూ అంతా ఊరక చూస్తుంటె
అది ఏమి న్యాయము॥

పెళ్ళంటే పెద్ద వ్యాపారము
తల్లి తండ్రులకే కొడుకైతె లాభం
కూతురు నష్టం - ఇది ఏమి ఖర్మం॥ఇది అంత స్త్రీ జాతి కపచారము
ఇది అంత స్త్రీ జన్మ గ్రహచారము॥

వరకట్నమనే ఘోరపిశాచి
వరుసగ మగువల సుఖములు దోచి
ఆత్మహత్యలు కొన్ని అసలు హత్యలు కొన్ని
ఇది అంతా మగజాతి కవమానము॥

"భామావిలాపం" యక్షగానంలోని పాట

## ఇది ఘోరము ఘోరము

ఇది ఘోరము ఘోరము ఘోరము
ఇది నేరము నేరము నేరము
ఇది పవిత్ర స్వతంత్ర భారతం
ఇట స్త్రీకి ఇదేనా గౌరవం? ॥

వరకట్న పిశాచి పిశాచి, తన
కోరలు సాచి సాచి
కోరుచున్నది బలి బలి బలి
అబలల మెడలకు ఉరి ఉరి ఉరి ॥

దాహము దాహము దాహము స్త్రీదాహము స్త్రీదాహము
కామము కామము కామము - తీరని తీరని కామము
క్షుద్ర హృదయముల రెచ్చి రెచ్చి
మానభంగముల హెచ్చి హెచ్చి
ఇది ప్రగతి పథంలో భారతం నవ భారతం ॥

నేటి వివాహం జూదం జూదం జూదం
నవ వధువు జీవితం పందెం పందెం పందెం
ఈ జూదంలో మరి ఓడినా మిగులును దుఃఖం దుఃఖం
స్త్రీకి మిగిలేది దుఃఖం ॥

రగిలిన మనసులో దుఃఖం ఉవ్వెత్తున లేచి లేచి
పగిలిన గుండెలో ద్వేషం ఎగసి ఎగసి పైకెగసి
మగువ మనసులో శోకసముద్రం - మృగజాతిని
ముంచెత్తేస్తే
అబల మనసులో రేగిన మంటలు
ఆరునా చల్లారునా ? ॥ఇది ఘోరము ...॥

("భామా విలాపం" యక్షగానంలోని పాట)



## పొగలు గ్రక్కుతూ కదిలింది

పొగలు గ్రక్కుతూ కదిలింది
పొగరు బోతు పొగబండి

గంతులేస్తు పెదరంకెలేస్తు, తన
కన్న జోరుగా నడిచేదెవరని॥

అటుపోతే ఇటు ఎదురొస్తాయ్
చిటికలోనె వెనకబడిపోతాయ్
చటుకున పొలాలు చెట్లు చేమలు
అటు ఇటు కొండలు గుట్టలు ఏళ్ళు॥

తాబేటి వంటి జోడెడ్లబండినీ
దాని తమ్ముడౌం టెద్దు బండినీ
దడదడ నడిచే గుర్రపు సార్టుని
దాని బాబు మోటారు కారునీ
సవాలు చేస్తుంది - చివాల్న పోతుంది॥

అన్నిటినీ సవాలు చేస్తూ
అన్నిటినీ దూసుకుపోతూ
ఆ ! అంటే ఆమడ దాటి
కో! అంటే కోసులు దాటి
రైలుబద్దైపై మద్దెల కొడుతూ
తకధిమి తకఘణు తకధిమి తకఝణు॥

కూతకూసినా షక్కికాదు, తెగ
పొగలు వదిలినా చుట్ట కాల్చదు
నొసటిమీద కన్నున్నప్పటికీ
శివుడుకాదు అది చెప్పకోండి, మరి
చెప్పకోండి అది రైలుబండి॥

## రాబడితో పనిలేదు

రాబడితో పనిలేదు
మాబడిలో చేరుటకు ॥

ఆ పేటా ఈ పేటా
అందరు పిల్లలు ఒక చోట
కలిసికట్టుగా ఇచ్చట
చదువుల చూస్తే ముచ్చట ॥

పలకలు బలపాలు, చవకగ
పాఠ్య పుస్తకాలు
మధ్యాహ్నం పాలు, పిల్లల
కన్నిటిలో సమపాలు ॥

అల్లరిగా తిరగొద్దు
చిల్లర స్నేహాలొద్దు
విలువైనది ఈ కాలం, అని
బడిలో చెప్పే పాఠం ॥

మా చదువే మా ధ్యేయం
పంతులు మాటే వేదం
మాలో లేదు భేదం, మా
అందరిదొకటే దేశం ॥



## పొగబండి పిలిచింది

పొగబండి పిలిచింది
కూతలు కూస్తూ!
ఈలలు వేస్తూ!
పొగబండి పిలిచింది
పిల్లల్లారా రారండి ॥

పెద్దలు మాత్రం దయచేసి, ఈ
పక్కకు రాకండి
పెద్దలు కూడా ఉంటే, ఇక్కడ
ఆగదండి ఈ బండి
రంగు రంగులా బండి, ఇది
పిల్లల రైలుబండి ॥

అక్కా చెల్లీ - అన్నా తంబీ
ఇరుగూ పొరుగూ దోస్తులు
అందరికీ ఇట చోటుంది
కుక్కా పిల్లా గంతులు వేస్తూ
పిల్లీ పిల్లా మ్యావ్ అంటూ
మీతో కూడా రావచ్చు ॥

అదిగదిగో...ఒక
అందాల లోకం...అది
పెద్దలకెంతో దూరం
ద్వేషం మోసంలేనిది
చింతలు వంతలు రానిది
చిన్నారులదాలోకం, అక్కడ
అందరి మనసులు ఏకం, మరి
చూసొద్దాము రండీ,
ఎక్కండి రైలుబండీ ॥

పిల్లీ పిల్లా పిచుకాపిల్ల
స్నేహంగా ఉంటాయట

పక్షులు అన్నీ ఆకులు వేసీ
పళ్ళున్నీ పడ్డేస్తాయట
సరదాగా ఆ కోకిల లెప్పుడూ
సంగీతం వినిపిస్తాయట, మరి
చూసొద్దాముర౦డీ, ఎ
క్కండి రైలు బండీ ॥

అక్కడ అంతా కిలకిల మంటూ
హాయిగ నవ్వే పిల్లలట
నలుపూ, తెలుపూ, ఎరుపూ, పసుపని
భేదాలేమీ లేవట
గొప్పా బీదా తేడాలంటూ
అక్కడ అసలే లేవట, మరి
చూసొద్దాముర౦డీ, ఎ
క్కండి రైలుబండీ ॥



# అక్కడ ఉందొక తోట

అక్కడ ఉందొక తోట, ఆ
తోట మధ్య నొక కోట, ఆ
కోటపై ఎగురు బావుటా, అది
పిల్లల రాజ్యపు బావుటా ॥

రంగు రంగులా పువ్వులు, వా
రన్ని దేశాల పిల్లలు, రా
చిలుకలు, గోరింకలు, పలి
కేయు స్వాగతాలు ॥

విడిది చేశారు కోటలో
పగలంతా ఆ తోటలో
పిట్టలూ తమ భాషలో, కలి
పాయి గొంతులందరితో ॥

అక్కడ ఉన్న తాత, ఆటలు
ఆడించెను మా చేత, పాటలు
పాడించేను మా చేతా
పెద్దయినాకా మేమంతా
కలిసుండాలి ముందంతా, అని
ప్రతిన బూనించె మాచేతా ॥

## ఎవరు తాతా! నీవు !

పిల్లలు :ఎవరు తాతా నీవు ?
మా ఊరికెపుడొస్తావు ?
మహా మంచి తాతవు నీవు

తాత :నేరాను నేరాను మీ
ఊరి కిప్పుడెరాను

పిల్లలు :మంచి తాతవు నీవు, మా
ఊరికెందుకు రావు ?

తాత :బాలల సంక్షేమము, దే
శానికే సౌభాగ్యము, అని
పెద్దలంతా నమ్మితే, మీ
ఊరు కిలకిల నవ్వితే, నే
నప్పుడొస్తాను, మీ
ఊరు వస్తాను॥

పిల్లలు :అవును తాతా నిజంగా , నీ
వప్పుడొస్తావా? మా
మంచి తాతా నిజంగా, మా
తోటే ఉంటావా ?

తాత :కులమత ద్వేషాలు
కుంచితపు స్వార్థాలు, అవి
లేని ఊరైతే, మనుషుల
మనసులొకటైతే, మీ
ఊరునేనొస్తా, మీ
తోటే నేనుంటా॥

పిల్లలు :నీ, మాటలన్నీ చెప్తితే, మా
పెద్దలూ తలలూపితే, మా



ఊరు వస్తావా ! మా తోటె ఉంటావా !

తాత :కపట మెరుగని లేతమనసులు
కలుషితము కాకుండా
గొప్పవారని బీదవారని
భేధమే లేకుండా, మీ
తల్లి తండ్రులు పెంచితే,
భాద్యతల నెరిగిన పౌరులైతే
అప్పుడొస్తాను, మీ
ఊరు నేనొస్తా,
మీతోటె నేనుంటా ॥

## వేరే ఉందొక లోకం

వేరే ఉందొక లోకం, ఆ
లోకం మీకు దూరం, ఆ
లోకం లోని బాలలం
ఎప్పటికీ చిన్నారులం॥

వికసించుట మరచిన మొగ్గలం
రెక్కలు తొడగని పక్షులం, మా
అందరిదీ ఒకే కులం, ఏ
భేదం లేని అమాయకులం॥

ఏది కావాలో, అది ఏదీ
తెలియని జీవులం, మా
కేమి కావాలో అది
అడుగుట రాని మూగలం, మా
ఆకలి తెలిసీ ఏవరైనా ఒక
ముద్ద తినిపిస్తే తింటాం
అలసీ అలసీ నిద్దురవస్తే
ఏ మూలో పడుకుంటాం॥

"ఎదికీ ఎదగని మేము, ఈ
లోకానికే ఒక భారము", అను
కుంటే అదేమి న్యాయం?, మము
తక్కువ చేసీ దూరం చేస్తే
అది మాత్రం ఘోరం,
అది మాత్రం నేరం॥

మీ లోకపుటంచుల దాకా, మెల
మెల్లగ నడిచే దాకా, మీ
చేయి కాస్త అందిస్తే, మీ
మీకాలం కాస్త వెచ్చిస్తే, ఒక
చల్లటి మాటే చాలు, అదే
మాకు పదివేలు॥



## తెల తెల్ల వారింది

తెల తెల్ల వారింది
తొలి ప్రొద్దు లేచింది
నలు దెసల వెల్గులూ
నాట్యాలు చేశాయి॥

రాత్రి చీకట్లలో
రగిలినా కోర్కెలు
పగటి వెల్తురులోన
పరదాల దాగాయి॥

అరనీ ఆశలు
తీరనీ కోర్కెలు
నుజ హృదయంలోన
మారాం చేశాయి॥

కలత నిద్దురలోన
కదిలినా కలలలో
కదను త్రొక్కాయెన్నో
అడవి జంతువులు॥ మనసులో ముసిరినా
మదమత్సరాలకు
బురఖాను తగిలించి
మోసగించును మనుజుడు
తన్ను తా మోసగించును
మనుజుడు॥

## వచ్చిందర్రా పండుగ

లేవండర్రా ముందుగా, మరి
ఈ రోజేరా పండగ॥

భగవానుడు ఇలపుట్టెనట
వార్తను దూతలు తెచ్చిరట
పరుగున గొల్లలు పోయిరట
పవిత్ర శిశువును చూచిరట॥

పశువుల పాకలొ ఓ మూల
జనియించెను ఈ జగమేల
నిరుపేదేమో ఆ ప్రభువు
పశువుల పాకలొ తన కొలువు॥

అనాదలకు ఆప్తుడట
నిరుపేదలకు నేస్తమట
పతితులనెప్పుడు బ్రోచునట
పాపులకిచ్చును రక్షణట॥

నరరూపము ధరియించెనట
పరమాత్ముడు ఆ బాలుడట
బాలుని జూచి ఊయలలూచి
హలె లూయా అని పాడుదము॥



## అది ఒక రాతిరి

అది ఒక రాతిరీ
మెదలు పొంగి సుధలు చింది
మరువ లేనిదా రాత్రి
మరపురానిదా రాత్రి॥

ఊరి వెలుపల పూరిపాకలో
పశువులు కట్టే చోట
కోరి అచటనే పుట్టుట, ఆ
పరమాత్ముని కది చోటా?, అని
వినిపించిందా మాట, ప్రతి
చోట ప్రతి నోట॥

దివి నుండీ దేవతలు
దిగి వచ్చిరి ఆ రాత్రి
పరి పరి విధముల వేడి
కరువు తీరగా పాడి
పరవశించిరా రాత్రి,
మైమరచి పులకించె ధరిత్రి॥

పరవున వచ్చిరి గొల్లలు
పశువులశాలలో ఎల్లరు - నిరు
పేదలు, నిర్భాగ్యులు, తమ
మేలికయే ఇట పుట్టెననీ, తమ
జన్మ ధన్యమని గడిపిన రాత్రి॥

మింట ఒక తార వెలిగింది
జ్ఞానులకు త్రోవ చూపింది
బాలుని చూచిన జ్ఞానులు
అచ్చెరు వొందిరి మనమున
అర్పించిరి తమ కానుకలు
అర్థించిరి ప్రభు దీవెనలు॥

# గొల్ల వాళ్ళ పాట

ఒరె ! ఒరె ! ఒరె! కన్నయ్య
అరె! అరె! అరె! చిన్నయ్య
ఎక్కడున్నావుర ఎల్లయ్య
సుక్కయ్య, సూరయ్య, మల్లయ్య, మరిడయ్య
పనులన్నీ ఒగ్గేసిరండయ్యా॥

దారి సూపే సామి వచ్చాడురా, ఇక
దారి తప్పవుర గొర్రెలు
కోరి కోరి సామి వచ్చాడురా
మరి యింక ఎందుకు చింతలు॥

గొర్రెల్లాంటి వోళ్ళమనీ
మొర్రి బాగులోళ్ళమనీ
దిక్కుకమనకెవరూ లేరనీ
ఇక్కడె కొచ్చాడురా, సామి
మనకోసమొచ్చాడురా॥

పెద్దోళ్ళ మేడలు మిద్దెలు ఉండగ
పేదోళ్ళ యింటికే వచ్చాడురా
గొప్ప గొప్ప వోళ్ళ లోగిళ్ళు ఉండగ
గొల్ల పాకలోనె పుట్టాడురా॥

పరుగా పరుగున రండిరా
ఏరి కానుకలు తెండిరా
పెరుగా పాలూ వెన్న మీగడలు
పట్రాండిరా పుట్టతేనియలు॥



# బెత్లెహేమ్ నగరమా

కలత లేని మనసుతో
గాఢమైన నిదురలో
శయనించిన నగరమా !
బెత్లెహేమ్ నగరమా!

కారు చీకటుల క్రమ్మే
నీ వీధులు
ఇపుడేమో విరజిమ్మును
వింత కాంతులు
నా కన్నుల భాగ్యమా
బెత్లెహేమ్ నగరమా॥

చిరకాలపు చింతలు
చిగురించిన ఆశలు
చివరకిచట కలిసినవి
నీ సుందర నగరిలో
ధన్యము మా జన్మనుమా !
బెత్లెహేమ్ నగరమా॥

క్రీస్తు పుట్టెను, ఇలకి
కాంతి తెచ్చెను
బెత్లెమేమ్ శిశువా
మా యేసువా

రారాజుకు మా ప్రభువుకు
ఇవే జోతలు
శాంతి శాంతి శాంతియనిరి
దేవదూతలు॥

## దొరికింది

దొరికింది, నా మనసు ఎగిరిందీ !
నా.....కన్నుల పంట
నా.....ముద్దుల మూట
గారాల పంట - వరాల మూట
దొరికిందిర ఈ పూట, మరి
పండగేర మా యింట ॥

అందాల గొర్రె పిల్ల, మరి
దోచుకుంది నా మనసెల్ల, ఇది
లేకపోతె నా బ్రతుకెల్లా? పెన
వేసుకుంది నన్నిల్లా ॥

సందమామ కంటె సక్కందీ
మల్లెపూలకంటె తెల్లందీ
సెంగు సెంగుమని దూకిందీ
యెన్నెల బంతిలా ఎగిరిందీ
బెదరు సూపులు సూసిందీ
సెదరి నా మనసు ఊగిందీ ॥

కనబడక పోతె రోజెల్లా
తిరిగాను కొండ కోనెల్లా
వెదికాను సెట్టు పుట్టల్లా, కంట
నిదరలేక నే రాత్రెల్లా ॥



## మనవలెనే మానవుడు

మనవలెనే మానవుడు, మన
అందరివలె సామాన్యుడు ॥

మనపైనా కరుణించి, ఈ
ధరణికి తానేతెంచి
దీనులకు బలహీనులకు
తోడై నిలచిన దేవుడు, అతడు ॥మనవలెనే మానవుడు॥

మూగకీ, చెవిటి రోగికీ,
కొండంత ధైర్యమై నిలిచి
కృంగిపడి ఉన్న పతితను,
గొంతెత్తి ప్రేమతో పిలిచి, తన
రక్షణ నిచ్చిన దేవుడు, అతడు
మనవలెనే మానవుడు ॥

రండు రండు మన రక్షకుడనుచు
రయమున చుట్టూ చేరెదరు
నిరుపేదలు నిర్భాగ్యులు
నిరాశ మునిగిన అనాధలు ॥

## కడసారి విందు

కడసారి విందు - కనుమూయు ముందు
కారుణ్యమే చిందు ఆ కన్నులందు॥ఎనలేని జాలి ఆ మోములందు
తన వారి విడిచి పోబోయె ముందు॥

శిష్యుల పాదాలు కడిగి, వారి
యోగ క్షేమాల నడిగి
ప్రియశిష్యులందర్ని ప్రియమార పిలిచి
ప్రభువేమొ పలికేను మనసేమొ విప్పి॥

కడసారి విందు - కడ తేరు ముందు
ఒక జ్యోతి వెలుగొందు - ఆ కన్నులందు॥

మిము వీడి నేపోవు సమయమొచ్చింది
ఇక మీద మీదేను ఈ కార్యభారం
విడవద్దు ధైర్యం ఇది దైవకార్యం
చూపండి చూపండి ఆ మోక్షరాజ్యం.

ప్రభుమాట వింటేను పగిలింది హృదయం
ప్రతికంట పొంగింది కన్నీటి రుధిరం

ప్రభువెళ్లి పోతేను మిగిలేది శూన్యం
ప్రతి గుండె చీల్చింది ఒక అర్తనాదం॥శిష్యుల నోదార్చె ఆ ప్రేమ హస్తం
ప్రభు మోము చూస్తేను కరుణా సముద్రం
ప్రభు వాక్కు నిండింది, సకలం సమస్తం
మనసంత వికలం, ఆ విందు మాత్రం॥



## వీడ్కోలు గీతం

ఇంత దూరం
కలిసి నడిచాము
ఎంతగానో
మనసు కలిపాము, మరి
ఇంక నాకు సెలవా
మరువను మీ స్నేహపు విలువ॥

ఆకాశవాణి కళాదేవత లోగిలి
కవులను గాయకులను కలిపినది
తన కౌగిలి, ఈ
ఇంటిలో రవ్వంత చోటు దొరికి,
నేనెంతగానో పెరిగి,
పాలక్కడలి నాలో పొంగి
కడలిలో వయ్యారులు, నే
నేర్చి కూర్చిన పాటలు, అవి
పాడెనెన్నో గొంతులు॥

మనసులల్లిన మమతల పందిళ్లు, రా
గాలు చిలికే స్నేహపు పొదరిళ్ళు
అన్ని ఇచటనె వదిలి, మెలమెల్ల నేను కదిలి,
సాగాలి ఇక నా ప్రయాణం ఏకాకిగా నా ప్రయాణం

31-5-1979న ఆకాశవాణి నుంచి పదవీవిరమణ చేసిన సందర్భంలో వీడ్కోలు సభలో పాడినపాట.

# నాద వినోదినీ

నాద వినోదినీ నవ
భావ రాగ రసవాహినీ, నవ
గీత మాధురుల రసధునీ, మా
పిలుపునందుకొని రమ్మనీ
పలికిందీ స్వాగతమనీ
మా నాదవినోదిని ॥

సునాదమే దైవముగా
సంగీతమే సాధనగా
సరిగమలే జపమాలగా
జపించి తపించు కళాకారులం
నాద వినోదిని బృందం.. ॥

తీరిక వేళలలో- మన
సారగ పాటలతో - మై
మరచి గడపాలనీ-మీ
రందరూ రావాలనీ-రస
హృదయులు మెచ్చాలనీ-
పిలిచింది నాదవినోదినీ
రమ్మంది నాద వినోదినీ ॥



శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారు 1919 సంవత్సరములో జూన్ 1వ తేదిన పశ్చిమ గోదావరి జిల్లా తిరుపతి పురం గ్రామంలో, సంస్కృతీ సంపన్నమైన కుటుంబంలో శ్రీ సాంబమూర్తి, సీతమ్మగార్లకు జన్మించారు. చిన్ననాటనే తండ్రిని కోల్పోయారు. సుప్రసిద్ధ రచయిత, శ్రీ పాలగుమ్మి పద్మరాజుగారు వీరి జ్యేష్ఠ సోదరులు.

మహా మహోపాధ్యాయ, వైణిక శిరోమణి, వైణిక సార్వభౌములు శ్రీ ఈమని శంకర శాస్త్రిగారి ప్రథమ శిష్యులు, ప్రియ శిష్యులు. శ్రీ దుర్గ సూర్యనారాయణ మూర్తి గారి వద్ద, Dr.S. రామనాథన్ గారి వద్ద శాస్త్రీయ గాత్ర సంగీతం అధ్యయనం చేశారు. వైణికుడుగా మద్రాసులో సినీరంగంలోను, ప్రముఖ నర్తకుడు శ్రీ ఉదయశంకర్ వాద్య బృందంలోనూ అపారమైన అనుభవం గడించారు. స్వరకర్తగా, ఆకాశవాణి (హైదరాబాదు కేంద్రం) లలిత సంగీత ప్రయోక్తగా లలిత సంగీతానికి ఒక విశిష్టతను చేకూర్చారు. జిజ్ఞాసువుగా సృజనాత్మక కృషి సల్పారు. ఔత్సాహిక గాయనీ గాయకులకు స్ఫూర్తినిచ్చి వారిలో నిబిడీకృతమైన ప్రతిభను వెలుగులోకి తెచ్చారు. ఆకాశవాణి నుంచి 31 మే 1979న పదవీ విరమణ చేశారు.

లలిత సంగీతంలో ఆసక్తిగల గాయనీ గాయకులకు ఉపయోగంగా వుంటుందనీ, శ్రీ పాలగుమ్మి వారి పాటలను పుస్తకరూపంలో భద్రపరచాలని "నాదవినోదిని" కోరగా, కోరగా శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారు తీర్చిన కోరిక - ఈ పుస్తకం.

—"నాదవినోదిని"